గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జెసి డాక్టర్ నవ్య

సమయం లేదు..!

- డీఎస్సీ అభ్యర్థుల్లో ఆందోళన
- జిల్లాలో 2,678 పోస్టులు
- సమయం పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ డీఎస్సీ ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,678 పోస్టులను భర్తీ చేయనున్నారు. పరీక్షలకు 45 రోజులు మాత్రమే సమయం ఇవ్వడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. కనీసం 60 నుంచి 90 రోజుల సమయం ఇవ్వాలన్న డిమాండ్ వ్యక్తం అవుతోంది...

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న సమయంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తొలి సంతకం చేశారు. ఆ హామీ మేరకు అధికారంలోకి వచ్చిన పది నెలల తరువాత మెగా డిఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఎట్టకేలకు నోటిఫికేషన్ వచ్చిందని అభ్యర్థులు సంతోషిస్తున్నా పరీక్షకు సమయం లేదని ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలోని 2,678 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఎస్‌జిటి 1801, ఎస్ఎ తెలుగు 90 పోస్టులను, ఎస్ఎ హిందీ 115 పోస్టులను, ఎస్ఎ ఇంగ్లీష్ 89, ఎస్ఎ గణితం 97, ఎస్ఎ భౌతిక శాస్త్రం 74, ఎస్ఎ జీవ శాస్త్రం 80, ఎస్ఎ సాంఘిక శాస్త్రం 118, పిఇటి 214 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఐదేళ్లుగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డీఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డిఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభంలో వదిలిన డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 1,543 పోస్టులు కేటాయించారు. టిడిపి ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. డిఎస్‌సి అనగానే రెండవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్న అన్ని పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. చాలా ఎక్కువ సిలబస్‌తో కూడుకున్నదని, ఎంత బాగా చదివిన వారైనా ఒక్కసారైనా పూర్తిస్థాయిలో రివిజన్ చేయాలి అంటే కనీసం 60 నుండి 90 రోజులు సమయం పడుతుంది. ప్రభుత్వం పది నెలల నుండి నానబెట్టి కనీసం ప్రిపేర్ అయ్యే సమయాన్ని ఇవ్వకుండా పరీక్ష నిర్వహించడం ఎంతవరకు సమంజసమని పలు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. 2018 డిఎస్‌సి పరీక్షలో బాగా చదివిన వారికి కాకుండా కేవలం రెండు రోజులు పరీక్ష రాసిన వారికి మాత్రమే 80 శాతం ఉద్యోగాలు వచ్చాయని, దీనికి ప్రధానమైన కారణం డిఎస్‌సి పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించి నార్మలైజేషన్ చేయడమే అని చెబుతున్నారు. అభ్యర్థులకు ఎవరికి అన్యాయం జరగకుండా ఉండాలంటే డిఎస్‌సి జిల్లా యూనిట్‌గా జరుగుతున్నందున ప్రతి జిల్లాకు ఒక రోజును కేటాయించి జిల్లాలోని అభ్యర్థులందరూ ఒకే పరీక్ష పేపర్ రాసే లాగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

సమయం ఇవ్వాలి.. ఒకే రోజు పరీక్ష నిర్వహించాలి

అనేక పోరాటాల ఫలితంగా నోటిఫికేషన్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం. నోటిఫికేషన్‌పై ఉన్న అభ్యంతరాలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలి. డిఎస్సీ సిలబస్ పూర్తిస్థాయిలో రివిజన్ చేయాలంటే కనీసం 60 నుండి 90 రోజులు సమయం పడుతుంది. అభ్యర్థులకు ఎవరికి అన్యాయం జరగకుండా ఉండాలంటే డిఎస్‌సి జిల్లా యూనిట్‌గా జరుగుతున్నందున ప్రతి జిల్లాకు ఒక రోజును కేటాయించి జిల్లాలోని అభ్యర్థులందరూ ఒకే పరీక్ష పేపర్ రాసే లాగా చర్యలు చేపట్టాలి. గత నోటిఫికేషన్ విడుదల సందర్భంగా అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. ఈ నోటిఫికేషన్ లో దానిపైన పూర్తిస్థాయి స్పష్టత ఇవ్వాలి. ప్రభుత్వం ఇస్తున్న డిఎస్‌సి కోచింగ్ పూర్తి కావడానికి కూడా సమయం పడుతుంది. కాబట్టి ప్రభుత్వం డిఎస్‌సి పరీక్షల షెడ్యూల్‌ను కనీసం 60 రోజుల నుండి 90 రోజులకు పెంచాలి. అభ్యర్థులు ఎవరూ నష్టపోకుండా ఆఫ్ లైన్ పరీక్ష లేదా ఆన్‌లైన్ అయితే జిల్లా అభ్యర్థులంతా ఒకే పేపర్ రాసే లాగా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో అభ్యర్థులతో కలిసి ఆందోళనకు దిగాల్సి వస్తుంది.

- వై.నగేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి.

వయోపరిమితి పెంచాలి

డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన పట్ల వర్షం వ్యక్తం చేస్తూనే డీఎస్సీ నోటిఫికేషన్ డీఎస్సీ పరీక్షకి 90 రోజుల గడువు ఉండాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ డిఎస్సి నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ గురించి స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం అప్రెంటిస్ విధానాన్ని తొలగిస్తున్నట్లు స్పష్టత ఇవ్వాలి. డీఎస్సీ పరీక్ష ఆన్‌లైన్‌లో దాదాపు నెల జరగడం వల్ల చాలామంది డీఎస్సీ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. కాబట్టి ఒక జిల్లా వారికి ఒకేరోజు పరీక్ష జరిగే నిర్వహించాలి. 2018 సంవత్సరం తర్వాత ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్ రాలేదు. కావున నిరుద్యోగులకు వయోపరిమితి 47 సంవత్సరాల వరకు పెంచాలి.

- కె శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి.

పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించాలి

- వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించాలి
- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష ఆదేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) లో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో వాటి పరిష్కార ప్రక్రియపై కూలంకుషంగా చర్చించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో 14 రోజులుగా రెండు, 15 రోజులుగా ఒక అర్జీ పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సిడిపిఓ కర్నూలు వద్ద 11 రోజులుగా రెండు అర్జీలు, తహశీల్దార్ కర్నూలు అర్బన్ కార్యాలయంలో 14 రోజులుగా ఒక అర్జీని తెరవకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పునఃపరిశీలనకు వచ్చిన అర్జీల్లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, కర్నూలు కార్యాలయంలో అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించిన కలెక్టర్, వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆర్డీఓను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్‌సేవల పోస్టర్ ఆవిష్కరణ

వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాష అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఎపి ప్రభుత్వం వాట్సాప్ సేవల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందచేస్తున్న వివిధ పౌర సేవలు మరింత చేరువ చేసే క్రమంలో వాట్సాప్ గవర్నెన్స్ ను '9552300009' నెంబర్ ద్వారా తెచ్చామని పేర్కొన్నారు. ధృవపత్రాలు, లైసెన్సులు, పన్నుల చెల్లింపులు, బిల్లులు, దేవాలయ దర్శనాలు, పరీక్ష ఫలితాలు వంటి 250 కి పైగా సేవలను పొందవచ్చునన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలి

- అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వ్యాన్స్ గోబ్యాక్
- ఎపి రైతు సంఘం నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అమెరికా ఉపాధ్యక్షుడు జెడివ్యాన్స్ పర్యటనను ఎపి రైతు సంఘం వ్యతిరేకించింది. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో అసమాన ఒప్పందాలు వద్దని హెచ్చరించింది. ట్రంప్, మోడీ విధానాలను ఖండించింది. జాతీయ ప్రయోజనాలను వదులుకోవద్దని ప్రభుత్వానికి సూచించింది. భారత వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వ్యాన్స్ పర్యటనను వ్యతిరేకిస్తూ కర్నూలు సుందరయ్య సర్కిల్ వద్ద ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో వ్యవసాయం, పాడి, మత్స్య రంగాలలో అసమాన ఒప్పందాలు వద్దని డిమాండ్ చేశారు. అమెరికాతో అన్ని అసమాన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల చర్చల నుండి కేంద్ర ప్రభుత్వం వైదొలగాలని ఆయన కోరారు. జెడి వ్యాన్స్ పర్యటన బహుళజాతి కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకు జాతీయ ప్రయోజనాలను వదులుకోవాలని భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్దేశించబడిందని అన్నారు. ట్రంప్, మోడీ విధానాలను ఖండిస్తూ, రైతులు, వ్యవసాయ కార్మికులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనందబాబు, కార్మిక నాయకులు రాముడు, నరసింహులు, ఇతర రైతు సంఘం నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో మధు రెడ్డి, ఉల్లందకొండ కె.మదు శేఖర్, ఆంజనేయులు, వెంకటస్వామి రైతులు కార్మికులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

పొగాకు రైతులను ఆదుకోవాలి

- కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పొగాకు సాగుచేసిన రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కలెక్టర్ పి.రంజిత్‌బాషను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ ఈ సంవత్సరం అధికంగా పొగాకు సాగు చేసినప్పటికీ, కంపెనీలు పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం వలె నలకతో సహా మొత్తం పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీలు తక్కువ ధరకు కొనాలని చూస్తున్నాయని ఆరోపించారు. పంట కొనుగోలు చేయకపోతే రైతులందరూ కలిసి ఆందోళన చేస్తారని హెచ్చరించారు. కలెక్టర్ స్పందిస్తూ, వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు జి. ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, బాలపీర, కె.మధు, శేఖరు, మధు రెడ్డి, గిడ్డయ్య, సీతారాములు, ఆంజనేయులు, ఈశ్వరయ్య ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణ

బొమ్మిరెడ్డిపల్లెలో శాంతియుతంగా జీవించాలి

- ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పిలుపు

ప్రజాశక్తి-వెల్దుర్తి

సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డి పల్లెలో జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ ప్రత్యేక పర్యటన నిర్వహించారు. గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి, గ్రామ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అల్లర్లు, గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని ఆయన గ్రామ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, ఎవరైనా అన్యాయం చేశారని తాము తప్పు చేయకూడదని ఆలోచించాలని అన్నారు. గ్రామస్తులందరూ కలిసి మెలిసి ఉండాలని, ఎలాంటి గొడవలు, సమస్యలకు తావు ఇవ్వకుండా ప్రశాంతమైన జీవితం గడపాలని కోరారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి లేదా సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమస్యలు తెలియజేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉండాలని హితబోధ చేస్తూ, వాటి వల్ల జీవితాలు నాశనం కావడంతో పాటు కేసుల్లో చిక్కుకుని భవిష్యత్తు అంధకారమవుతుందని హెచ్చరించారు. గ్రామంలోని నీటి సమస్య గురించి ఆరా తీశారు. గ్రామాభివృద్ధి, పిల్లల భవిష్యత్తు ముఖ్యమని పేర్కొంటూ, పిల్లలతో మాట్లాడి బాగా చదువుకోవాలని సూచించారు. ఎటువంటి ఘటనలు జరిగినా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ తేజమూర్తి, వెల్దుర్తి సిఐ మధుసూధన్ రావు, కర్నూలు వన్ టౌన్ సిఐ రామయ్య నాయుడు, మహిళా పిఎస్ సిఐ విజయలక్ష్మీ, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఖాజావలి, వెల్దుర్తి ఎస్ఐ అశోక్, క్రిష్ణగిరి ఎస్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మాట్లాడుతున్న సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్

కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం

సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిజెపి, తెలుగుదేశం ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను సిఐటియు ఖండించింది. కార్మిక చట్టాలను కాపాడాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని డిమాండ్ చేసింది. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడాలని కోరింది. సోమవారం సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ అన్ని యూనియన్ల ఆఫీస్ బేరర్స్ సమావేశం అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన సుర్జీత్ భవన్లో నిర్వహించారు. మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్ పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కార్మికుల హక్కులను హరించడం, చిన్న వ్యాపారస్తులు, చేతివృత్తుల వారిని ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలను ఆయన ఖండించారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని, కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు, సిఐటియు నగర నాయకులు రాంబాబు, కుమార్, మాసూం, ప్రకాష్ ,శీను, మద్దిలేటి, నగేష్, బీసన్న, సేక్షా, కష్ణ, బడే భాషా, వెంకటేష్ మరియు కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న మండల ఉపాధ్యక్షులు శేషయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్ ఎంపిడిఓ శ్రీనివాసులకు బి.నాగన్న, సంఘం మండల ఉపాధ్యక్షులు శేషయ్య వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత జనవరి లాస్ట్ నుండి ఉపాధి బిల్లులు బకాయిలు ఉన్నాయని, దాదాపు 10 నుండి 12 వారాలు బిల్లులు రాలేదన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఉపాధి పనులు చేసే కార్మికులకు పనిముట్లు ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. దీంతో కూలీలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఉపాధి కూలీలను పొమ్మనకుండా పొగ పెట్టే చందంగా కేంద్ర ప్రభుత్వం చర్యలున్నాయని అన్నారు. తక్షణమే ఉపాధి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. ప్రతి కూలి కుటుంబానికి పనిముట్లు పారా, సలిక, గంప ఇవ్వాలన్నారు.

ఓర్వకల్లు ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న నాగన్న

ప్రయివేటు బడులొద్దు.. ప్రభుత్వ బడులే ముద్దు...

ప్రభుత్వ బడిలో అందరినీ చేర్పిద్దాం -కోడుమూరులో విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ప్రయివేటు బడులొద్దు..ప్రభుత్వ బడులే ముద్దు.. అంటూ కోడుమూరు పట్టణంలో సోమవారం విద్యార్థులు జివిఆర్ జడ్‌పి హైస్కూల్ నుండి పాత బస్టాండ్ మీదుగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రైవేట్ బడిలొద్దు ప్రభుత్వ బడులు ముద్దు ప్రభుత్వ బడిలో అందర్నీ చేర్పిద్దాం అనే నినాదంతో కోడుమూరు ఎంఇఒ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు పాఠశాలల్లో గల సౌకర్యాలను తెలియజేసే ప్లకార్డ్స్‌తో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఇఒ తైమూరు బాష మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవితకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించమని పాఠశాలల్లో పోషకపదార్థాల్లో కూడిన ఆహారం ,శారీరక మానసిక వికాసం కోసం వ్యాయామ విద్య ,ఒత్తిడి లేని నాణ్యమైన విద్య , దృశ్య శ్రవణ విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, కొనసాగిస్తూ వ్యక్తి వికాసానికి సమాజ మార్పునకు పునాదులు ప్రభుత్వ పాఠశాలలని మండల విద్యాశాఖ అధికారి 2 కోడుమూరు బి.తైమూర్ బాష తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో జివిఆర్ జడ్‌పి హైస్కూల్ కోడుమూరు విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు ఇస్మాయిల్, నవీన్ పాటీ, శాంతమూర్తి నాయుడు, ఉషా కిరణ్ ,సరస్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో పట్టణంలోని వీధులలో నినాదాలు చేస్తూ బడి పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న ఎంఇఒ తైమూరు బాష

పకృతి వ్యవసాయంపై మొక్కుబడి అవగాహన

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రకృతి వ్యవసాయంపై ప్రజలకు అవగాహన కల్పించాలంటూ రూ.కోట్లు వెచ్చించి ఉద్యోగస్తులను నియమించింది. మొక్కుబడిగా అవగాహన కల్పిస్తున్నట్లు పత్తికొండ మండలం ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలోని రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలోని ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయంపైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. పకృతి వ్యవసాయ అధికారులు తూతూ మంత్రంగా కాయగూరల స్టాల్స్ ఏర్పాటు చేసి మధ్యాహ్నం కల్లా చేతులెత్తేసి మమ అనిపిస్తున్నారు. కెమికల్ రసాయనాలు మందులతో పండించిన కాయగూరలు తిని ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలపై ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.జిల్లా వ్యవసాయ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

యుపివిసిలో సింటాకు సాటి రాదు ఏది...

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కిటికీలు, డోర్ల తయారిలో సింటాకు మరేది సాటి రాదని స్థానిక కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నందు గల వెంటో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత సత్యనారాయణ గురువారం విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. సొంతా ఇల్లు అనేది ప్రతి సామాన్యుడి కల అని, తన ఇల్లు ఎంతో అందంగా , దృఢంగా ఉండాలని కోరుకుంటారన్నారు. ఇంటికి ప్రధానంగా కావాల్సింది కిటికీలు , డోర్లు అవసరం. ఇప్పుడు కిటికీలు, డోర్లు చదలు పడతాయని, వర్షానికి తడిచి ఉబ్బుతాయని, కాలిపోతాయని భయపడాల్సిన అవసరం లేకుండా మా యుపివిసి విండోస్ రూపొందించబడ్డాయని తెలిపారు. 20 సంవత్సరాల గ్యారెంటీ. లైఫ్ టైం ఫ్రీ సర్వీస్ ఇస్తున్నామని తెలిపారు. మేము ఇచ్చి అన్ని విండోస్ కు, డోర్స్‌కు ఫుల్ లెన్త్ ఐరన్ వేస్తాం. మా దగ్గర 80,88,91,108 సిరీస్ విండోస్ ఉన్నాయన్నారు. వీటితోపాటు ఎపిఎస్ డోర్స్ కూడా ఉన్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకుంటా రని ఆశిస్తునానని పేర్కొన్నారు.

ముళ్ల పొదల్లో 'అంగన్వాడీ'

దారిలేక బాలల కష్టాలు -నిద్రావస్థలో శిశుసంక్షేమ అధికారులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం బైతోలి గ్రామంలో ముళ్ల పొదల మధ్య అంగన్వాడీ కేంద్రం ఉంది. ఊరికి ప్రాథమిక పాఠశాలకు ఆనుకొని ఉన్న ఈ అంగన్వాడీ కేంద్రానికి దారి లేక ఇక్కడికి వచ్చి వెళ్లే బాలలు కష్టాలు పడుతున్నారు.దీని పక్కనే పాఠశాలకు సిసి రోడ్డు ఉంది. కానీ ఈ అంగన్వాడీకి మాత్రం ఆ సీసీ రోడ్డు అంత సజావుగా లేదు. దీనికి దారి పాఠశాల వెనుకాల ఉన్నప్పటికీ ముళ్ల కంపలతో, రాళ్లతో, రప్పలతో ఉండి దారి ఆనవాళ్లు కోల్పోయింది. అంగన్వాడీ కేంద్రం ముందు గాని, చుట్టూ గాని కనీసం ఒక మీటర్ స్థలం లేకుండా కంప నిండుకొని అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది.

అదే వర్షకాలంలో వెళ్లడం కష్టంగా ఉంది. తప్పని పరిస్థితులలో ఇళ్ల దగ్గరే బాలలు ఉండి పోవాలసిన దుస్థితి నెలకొంది. అప్పుడప్పుడు విష పురుగులు సంచారంతో అక్కడి టీచర్, ఆయా, బాలలు ఆందోళన చెందాల్సి వస్తుంది. ఇది తెలిసి కూడా శిశు సంక్షేమ అధికారులు నిద్రావస్థను వీడటం లేదు.

ఇంటర్మీడియట్ ఆఫీసర్‌గా సురేష్ బాబు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

జిల్లా ఇంటర్మీడియట్ ఆఫీసర్గా సురేష్ బాబును నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన శ్రీ సత్య సాయి జిల్లాలోని తాడిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఆర్ఐఒ తో పాటు జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ పోస్టులలో ఆర్ఐఒ గా గురువయ్య శెట్టి ,డివిఇఒ గా పరమేశ్వర్ రెడ్డి కొనసాగుతున్నారు. ఇప్పుడు ఈ రెండు పోస్టులను రద్దు చేస్తారా? లేక యధావిధిగా కొనసాగిస్తారా అనేది ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. ప్రస్తుతం నియమించిన జిల్లా ఇంటర్మీడియట్ ఆఫీసర్ పోస్టుకు సంబంధించి రెండు పోస్టులను ఒకే గొడుగు తెస్తారనేది కూడా పూర్తిస్థాయిలో వివరణ చేయకుండానే నియామకాలను చేపట్టారు.

టీచర్ల సీనియార్టీ జాబితా విడుదల

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శామ్యూల్ పాల్ సోమవారం ఓ ప్రకటన లో పేర్కొన్నారు. తాత్కాలికంగా తయారుచేసిన సీనియారిటీ జాబితాను డిఇఒ బ్లాగస్పాట్ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశామన్నారు.

నిరసన తెలుపుతున్న ముస్లిం జెఏసి నాయకులు

రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం

ముస్లిం జెఏసి పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బిజెపి కబంధహస్తాల నుండి కాపాడాలని ముస్లింజెఎసి పిలుపునిచ్చింది. కర్నూలు నగరంలోని అలీషేర్ బాగ్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ముస్లిం జెఎసి నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మైనారిటీ వ్యతిరేక చట్టాలు తెస్తోందని విమర్శించారు. ముస్లిం జెఎసి నాయకులు , ఆవాజ్ నగర కార్యదర్శి,ఎస్ఎం డి షరీఫ్, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు ఈనాయతుల్లా ఖాన్ , జమాతే ఇస్లాం ఏ హింద్ జిల్లా నాయకులు పిఎస్ మునీర్ అహ్మద్ లు మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దు, యూనిఫాం సివిల్ కోడ్, ఎన్ఆర్‌సి, సిఎఎ, హిజాబ్ వంటి చట్టాలు మైనారిటీలను లక్ష్యంగా చేసు కున్నాయని విమర్శించారు. వక్ఫ్‌చట్ట సవరణను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పోరాటాలకు విలువ లేకుండా పోతుందా అని జెఎసి ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేస్తామని జెఎసి హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో గౌస్ బాషా,మాలిక్, జావేద్, సీ ఐ టీ యు నగర నాయకులు మద్ది లేటీ, షబ్బీర్, రియాజ్ ,ఫక్రుద్దీన్, అక్బర్ బాషా, సయ్యద్బాషా, జహంగీర్ ఖాన్, షఫీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : వ్యకాస

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలో సుమారు 11 వారాలుగా పనిచేసిన ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించలేదని, తక్షణమే చెల్లించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న కోరారు. సోమవారం వ్యకాస ఆధ్వర్యంలో ఆదోని ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత జనవరి నుంచి ఉపాధి వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, చేసిన పనికి 15 రోజుల్లో వేతనాలు ఇవ్వాలని చట్టం చెబుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం చట్టాన్ని ఉల్లంఘిస్తోందని విమర్శించారు. ఏప్రిల్ నుంచి ఉపాధి పనులు మందకొడిగా సాగుతున్నాయని, ఫారంపాండ్స్ పనులు చేపట్టాలని లక్ష్యాలు పెట్టడం వల్ల వేసవిలో ఈ పనులు చేయడం అసాధ్యమని పనులకు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. వేతనాలు చెల్లించి, ఫారంపాండ్స్ పనులు కాకుండా ఇతర పనులు ఫీడర్ ఛానల్, పూడికతీత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... ఈ వారంలో వేతనాలు కూలీల ఖాతాల్లో జమవుతాయని హామీ ఇచ్చారు. వ్యకాస మండల కార్యదర్శి రామాంజనేయులు, సిఐటియు మండల అధ్యక్షులు జె.రామాంజనేయులు, రైతుసంఘం మండల నాయకులు హనుమంతు రెడ్డి, వ్యకాస నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

- ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు

పాఠశాలలో చేరిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కౌతాళం

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన అందిస్తున్నామని ఎరిగేరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు తెలిపారు. సోమవారం ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఎరిగేరి ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎరిగేరి ప్రాథమిక పాఠశాల మెయిన్, ఎరిగేరి ప్రాథమిక పాఠశాల (డిపిఇపి), తోవి ప్రాథమిక పాఠశాల నుంచి అడ్మిషన్ కోసం వచ్చిన 150 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, ఎరిగేరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడారు. అనుభవం కల ఉపాధ్యాయుల చేత బోధన, క్రీడల్లో ప్రోత్సాహం, విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించామని తెలిపారు. ఎరిగేరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మాధురి, రామకృష్ణుడు, శ్రీనివాసులు, బీరప్ప, అబ్దుల్ రహీం, సుధాకర్ నాయక్, రమేష్, తోవి ప్రధానోపాధ్యాయులు బసప్ప, ఎరిగేరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమారి, ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు హరికృష్ణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - ఆలూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకల్లో అస్వస్థతకు గురై మృతి చెందిన బి.సురేంద్ర నాయుడు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. సోమవారం ఆలూరులోని ఎన్‌జిఒస్ కాలనీలో టిడిపి యువనేత బి.సురేంద్ర నాయుడు మృతదేహానికి టిడిపి జెండా కప్పి తిక్కారెడ్డి, ఆలూరు ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. పార్టీ ఒక మంచి యువ నాయకుని కోల్పోయిందని, సురేంద్ర లేని లోటు టిడిపిలో కనబడుతుందని తెలిపారు. మాజీ జడ్‌పిటిసిలు రాంభీమ్ నాయుడు, ఏరూరు మీనాక్షి నాయుడు, అర్ధగేరి రఘు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సురేంద్ర మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తిక్కారెడ్డి, వీరభద్ర గౌడ్

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- జడ్‌పి హైస్కూల్‌లో తగ్గుతున్న విద్యా ప్రమాణాలు
- సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు చేపట్టాలి
- ఎంపిడిఒ మణిమంజరి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ మణిమంజరి ఆదేశించారు. సోమవారం గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి బి.నసురుద్దీన్ అధ్యక్షత వహించారు. ప్రధానంగా మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ మణి మంజరి సూచించారు. మండలంలోని గ్రామాల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు 24 నీటి తొట్లను మంజూరైనట్లు ఎడిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. రైతుల పొలాల్లో ఉపాధి హామీ చట్టం కింద పంట నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలని ఏపీవో మహ్మద్ బాషా తెలిపారు. గోనెగండ్ల ఎంపిటిసి-1 టి.రజియా సుల్తానా మాట్లాడుతూ... గోనెగండ్ల జడ్‌పి హైస్కూల్లో ప్రతేడాది 10వ తరగతి ఫలితాలు తగ్గుతున్నాయని, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను సమావేశానికి పిలిపించి మాట్లాడి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ... హెచ్‌ఎంలను మండల సమావేశానికి పిలిపించడం కుదరదని, సమస్యలున్న పాఠశాలలో ఎంఇఒ ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

మాట్లాడుతున్న ఎంపిటిసి రజియా సుల్తానా

హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాలి : సిఐ విజయభాస్కర్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల ప్రవర్తనపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని గోనెగండ్ల సిఐ విజయభాస్కర్ తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రవర్తన, నడవడికను సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని అన్నారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే తమ సహకారం తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో పాలాభిషేకం

మెగా డీఎస్సీ పేరుతో
యువతను మోసం చేసిన జగన్

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైసిపి హయాంలో మెగా డీఎస్సీ పేరిట నిరుద్యోగ యువతను మాజీ ముఖ్యమంత్రి జగన్ మోసం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీ నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేసి నిరుద్యోగులకు న్యాయం చేశారన్నారు. సోమవారం స్థానిక కుర్ని కల్యాణ మండపంలో డీఎస్సీ అభ్యర్థులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి - కోసిగి

దేశవ్యాప్తంగా తపాల శాఖలో పనిచేస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగుల (జిడిఎస్) సమస్యల పరిష్కారమే ధ్యేయమని భారతీయ తపాల ఉద్యోగుల సంఘం (జిడిఎస్) ఆలిండియా అధ్యక్షులు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్రామి రెడ్డి తెలిపారు. జిడిఎస్‌ల చైతన్యం కార్యక్రమంలో భాగంగా సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా తపాల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 2.63 లక్షల మంది బ్రిటీష్ కాలం నుంచి కూడా అరకొర వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు. జిడిఎస్ కండక్ట్ ఎంగేజ్‌మెంట్ రూల్స్‌తో ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తూ పని ఒత్తిడి పెంచుతున్నారని తెలిపారు. జిడిఎస్ ఉద్యోగులు ఏ యూనియన్ అయితే సమస్యలు పరిష్కరిస్తుందో ఆలోచించి మద్దతు ఇవ్వాలని కోరారు. జిడిఎస్‌లు గోపాల్ స్వామి, జిలాని బాష, రాంప్రసాద్, పరశురాముడు, రాజు, గోవిందు, సుధాకర్, భాస్కర్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రిన్సిపల్

ఘనంగా లింగప్ప పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైష్ణవి కళాశాలల ఛైర్మన్ జీడి లింగప్ప పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం వైష్ణవి డిగ్రీ జూనియర్ కళాశాలలో అధ్యాపక బృందం, విద్యార్థుల మధ్య ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. కరస్పాండెంట్ సత్య సిరి, వైష్ణవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మధుబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మునెప్ప పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. అలాగే విద్యార్థి సంఘాల నాయకులు, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థుల్లో పోటీ తత్వం పెరగాలి

- జెకెఎల్‌ఎస్ కరస్పాండెంట్ లింగన్న

ప్రజాశక్తి - కౌతాళం

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో చదువులో పోటీతత్వం పెరగాలని జెకెఎల్‌ఎస్ కరస్పాండెంట్ లింగన్న పేర్కొన్నారు. సోమవారం స్థానిక జెకెఎల్‌ఎస్ పాఠశాలలో స్టూడెంట్ అకాడమిక్ ఇయర్ ఆఫ్ ఫైనల్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ యు.లింగన్న మాట్లాడుతూ... విద్యార్థుల విద్యా అభివృద్ధికి ఈ సంవత్సరంలో నిర్వహించిన క్యాప్స్, విష్ తెలుగు, విష్ ఇంగ్లీష్, మంత్లీ ఎస్ఐఆర్ రిపోర్ట్‌లో విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రతి విద్యార్థిలోనూ తాము కూడా చదవగలం, రాయగలం అనే భావనను కలిగించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఆహ్లాదకరమైన పోటీతత్వాన్ని కలిగించి వారి వారి సామర్థ్యాలకు తగిన గుర్తింపు సర్టిఫికెట్లను, మెడల్స్‌ను బహుకరించినట్లు చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు


సన్మానిస్తున్న మాన్వి దేవేంద్రప్ప

ప్రతిభతో ఉన్నతంగా రాణించాలి

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ మరింత రాణించాలని కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తెలిపారు. ఆదోనిలోని విశ్వనారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకు సాధించిన ఎస్.సుజాత 493, ఎం.దివ్య 491, ఎస్.గౌస్ బాష 980ను అభినందిస్తూ సోమవారం శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాంత్రికి గ్రామానికి చెందిన గౌస్ బాష, కడితోటకు చెందిన దివ్య తల్లిదండ్రులు రోజువారీ కూలీగా పనిచేస్తూ పిల్లలను చదివిస్తున్నారన్నారు. పిల్లలు సాధించిన ఘనతను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వివాహ అనంతరం భర్త ప్రోత్సాహంతో చదువుకుంటున్న ఎస్.సుజాత సాధించిన ఘన విజయం చూసి భర్త జయరాం ఆనందం వెలిబుచ్చారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున మాట్లాడారు. పేద, గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం వల్లే రాష్ట్ర స్థాయిలో మెరిశారని పేర్కొన్నారు.

మాజీ సర్పంచి తలారి ఈరమ్మ మృతి

ప్రజాశక్తి - నందవరం

మాజీ సర్పంచి తలారి ఈరమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు మాధవరావు దేశాయ్ ఆమె నివాసానికి చేరుకొని పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం నింపారు. ఈ సందర్భంగా మాధవరావు దేశాయ్ మాట్లాడారు. 2006వ సంవత్సరంలో సర్పంచిగా గెలుపొంది గ్రామాభివృద్ధికి ఆమె కృషి చేశారని తెలిపారు. వడ్డేగిరి నరసింహులు, చాకలి పంపయ్య, చాకలి వెంకటేష్, తెలుగు ఈరన్న, వడ్డే నాగన్న, బతకన్న, ఆనంద్, సుంకన్న, నాగేంద్ర ఉన్నారు.


నివాళులర్పిస్తున్న మాధవ రావు దేశాయ్

సమస్యలు పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

ప్రజల నుంచి వచ్చిన వినుతులను సకాలంలో పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం ఆదోనిలో సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్య ప్రాధాన్యతను బట్టి ఆయా శాఖ అధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. సమస్యను త్వరగా పరిష్కరించి సమస్య తీవ్రతను అర్జీ దారులకు వివరించాలన్నారు. సకాలంలో స్పందించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస రాజు, వేణు సూర్య, డిఎల్‌పిఒ నూర్జహాన్, డిఎల్‌డిఒ రమణా రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డిప్యూటీ తహశీల్దార్ వలీ బాష ఉన్నారు.

పీడీ పోస్టులను రద్దు చేయవద్దు

- డివైఎఫ్ మండల కార్యదర్శి మైనా

ప్రజాశక్తి- ఆలూరు

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) పోస్టులను రద్దు చేయడం సరైంది కాదని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా తెలిపారు. సోమవారం ఆలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీడీ పోస్టులు రద్దు చేయడం వల్ల క్రీడల్లో ప్రతిభ గల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లే సమయంలోనూ, వివిధ రకాల ఉద్యోగ అవకాశాల్లోనూ క్రీడా కోటాలో ఉన్న సీట్లు, ఉద్యోగావకాశాలు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. పీడీ పోస్టుల రద్దును నిలిపేయాలని, సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పిఇటి కవి రాజు, డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు బసవరాజ్, మండల నాయకులు లక్ష్మీనారాయణ, సోమశేఖర్, మధు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై ఎఒ విచారణ

ప్రజాశక్తి - మంత్రాలయం

విచారణ చేపడుతున్న ఎఒ

మండలంలోని సూగూరు గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు కురువ పెద్దయ్య మృతిపై ఎఒ జీరా గణేష్ విచారణ చేపట్టారు. సోమవారం సూగూరు గ్రామం చేరుకున్న ఆయన పెద్దయ్య ఇంటికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణాలు, వివరాలను మృతుని భార్య కురువ వీరనాగమ్మను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిపి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

కళాశాల అభివృద్ధికి తోడ్పాటు హర్షణీయం : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి తోడ్పాటు నందించడం హర్షించదగ్గ విషయమని కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు తెలిపారు. సోమవారం చిప్పగిరి కళాశాల అభివృద్ధికి కడప డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు ఆదినారాయణ రెడ్డి రూ.30 వేల విరాళం ప్రిన్సిపల్ వరదరాజులుకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో అభివృద్ధి పనులకు సహకారం అందించడం హర్షణీయమని తెలిపారు.

హత్య రాజకీయాలకు పాల్పడితే ప్రతిఘటన తప్పదు : వైసిపి

- ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఆలూరు

హత్య రాజకీయాలకు పాల్పడితే ప్రతిఘటన తప్పదని వైసిపి నాయకులు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆలూరులోని అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం టిడిపి ఇన్‌ఛార్జీ ప్రోద్బలంతో కురువ ఈరన్నను దారుణంగా హత్య చేశారని తెలిపారు. సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్ కురువ ఈరన్న కుటుంబాన్ని పరామర్శించి వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి, మాజీ ఎమ్మెల్యే కె.శ్రీదేవి, రాష్ట్ర నాయకులు సురేంద్ర రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షులు శశికళ మాట్లాడారు. బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. హత్య చేసింది టిడిపి నాయకులేనని, కపట రాజకీయాల కోసం ఎంపీ పరామర్శించి ఈరన్న భార్యకు అంగన్వాడీ హెల్పర్ పోస్ట్ ఇస్తామని ఆశ కలిగించారని చెప్పారు. ఈరన్న భార్యకు అంగన్వాడీ పోస్టు ఇస్తామని చెప్పి.. స్థానిక నాయకులు తమ చుట్టూ తిప్పించుకొని అంగన్వాడీ పోస్టు ఇతరులకు ఇచ్చారన్నారు. అందుకే ఈరన్న కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాల్సి వచ్చిందన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

'దీక్ష' స్టూడెంట్ పేరెంట్స్ సక్సెస్ మీట్

- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం
- విద్యార్థులకు ట్రోఫీ, మెడల్స్ అందజేత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనా రెడ్డి ఆధ్వర్యంలో 'స్టూడెంట్ పేరెంట్స్ సక్సెస్ మీట్' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి టౌన్ టాపర్లుగా, కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. అతి తక్కువ ఫీజుతో ఇంటర్మీడియట్ విద్యతో పాటు జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ లాంటి వాటికి కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాల విద్యార్థులకు తమ తల్లిదండ్రుల సమక్షంలో ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం శాలువాలతో సన్మానించింది. జూనియర్ బైపిసి విద్యార్థిని అన్నా, పేరెంటు హుస్సేన్ మాట్లాడుతూ... దీక్షా జూనియర్ కళాశాల క్రమశిక్షణకు మారుపేరని తెలిపారు. సీనియర్ బైపిసి విద్యార్థిని భూమిక మాట్లాడుతూ... ఉత్తమ మార్కులు సాధించడానికి మీరిచ్చిన ప్రోత్సాహం మరువలేమని తెలిపారు. మరో విద్యార్థిని శ్రీదేవి మాట్లాడుతూ... కళాశాల అధ్యాపకులందించిన ప్రోత్సాహంతో అత్యధిక మార్కులు సాధించినట్లు చెప్పారు.

విద్యార్థిని తల్లిదండ్రులను సన్మానిస్తున్న సిబ్బంది

న్యాయవాదులపై దాడులు అరికట్టాలి

- రక్షణ చట్టం కోసం కదం తొక్కిన న్యాయవాదులు

ప్రజాశక్తి - ఆదోని

న్యాయవాదులపై దాడులను అరికట్టాలని, వెంటనే రక్షణ చట్టం అమలు చేయాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, న్యాయవాది శ్రీరాములు, జనరల్ సెక్రటరీ, న్యాయవాది జీవన్ సింగ్, సీనియర్ న్యాయవాది వైఆర్.మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం కోర్టులో విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. అంతకుముందు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బెంగళూరులోని హైకోర్టు న్యాయవాది సదాశివారెడ్డిపై అతని ఛాంబర్‌లోనే ఇనుపరాడ్లతో దాడి చేయడం సమంజసం కాదన్నారు. బార్ కౌన్సిల్ మెంబర్‌గా వ్యవహరిస్తున్న సదాశివరెడ్డి ఓ కేసును డిస్మిస్ చేశారన్న నెపంతో పాత కక్షలు మనసులో ఉంచుకొని విచక్షణారహితంగా గాయపరచడం హేయమైన చర్య అని విమర్శించారు. సీనియర్ న్యాయవాదులు దేశాయి, నాగేంద్రయ్య, శ్రీనివాసులు, సుందర్ సింగ్, ఆనంద్, హరినాథ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సావిత్రి, రాజారత్నం, వెంకటేశ్వర్లు, వీరేష్, రజనీకాంత్, విక్రం రెడ్డి, రఘు, కృష్ణ యాదవ్ ఉన్నారు.

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న అధికారులు

'ప్రకృతి' కూరగాయలతో మంచి ఆరోగ్యం

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు వాడటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ఆ దిశగా వ్యవసాయ ఉత్పత్తుల సాగుకు రైతులు ముందుకు రావాలని ఎంపిడిఒ అల్లా బకాష్, ఎంఇఒ సావిత్రమ్మ, పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఏపీఎం నాగార్జున తెలిపారు. సోమవారం మండల కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతుల భాగస్వామ్యంతో పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులైన టమోటా, పచ్చి మిర్చి, ముల్లంగి, క్యారెట్‌తో పాటు ఆకుకూరలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలను ఉపయోగించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు నరేంద్ర, సిసింద్రీ, అస్పిరేషనల్ అధికారి నరసింహులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రంగయ్య, ఝాన్సీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో కొత్త అనుభవం

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - నందవరం

ఇంటర్న్‌షిప్ తమకు కొత్త అనుభవాలను అందించిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తెలిపారు. విద్యాసంవత్సరం దసరా సెలవులను సద్వినియోగం చేసుకుంటూ, నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి ఒకేషనల్ విద్యార్థులకు ప్రత్యేక ఇంటర్న్‌షిప్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు నందవరం ప్రాంతంలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షాపులు శ్రీనివాస్, జగదీష్, బిస్మిల్లా, ఐటి రంగానికి చెందిన సచివాలయం, మీసేవా సెంటర్లు, ఫొటోగ్రఫీ స్టూడియోల్లో నైపుణ్యం కలిగిన టెక్నీషియన్ల ద్వారా శిక్షణ పొందారు. ప్రతి ఇంట్లో ఉండే ఎలక్ట్రానిక్ పరికరాలు సాధారణంగా ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార పద్ధతులను విద్యార్థులు ప్రాక్టికల్‌గా నేర్చుకున్నారు. కస్టమర్ డీలింగ్, సమస్యల పరిష్కారం వంటి అనుభవాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. మొత్తం 12 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగింది. 12 రోజులు ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు శివరాం చేతులమీదుగా సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటర్న్‌షిప్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, విద్యలోని ప్రాక్టికల్ అర్థాన్ని వారికి చూపించి, భవిష్యత్తుపై స్పష్టతను అందించిందని తెలిపారు. ఈ శిక్షణకు మార్గనిర్దేశకులైన శిక్షకులు శివకృష్ణ యాదవ్, విశ్వనాథ్ మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పట్ల ఆసక్తిని పెంచుతాయని, వారిలోని ప్రతిభను వెలికి తీసి, భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ... ఇంటర్న్‌షిప్ తమకు ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిందని, ఉన్నత చదువుల పట్ల ఆసక్తి కలిగించిందని తెలిపారు. ఉద్యోగం పట్ల భయం పోయి, జీవితాన్ని స్వయంగా నడిపించే ధైర్యం కలిగిందని చెప్పారు. జగదీష్, శీను, శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

విద్యుత్ తీగలు తగలి గడ్డి దగ్ధం

ప్రజాశక్తి - నందవరం

దగ్ధమవుతున్న గడ్డి

నాగలదిన్నె గ్రామంలో గడ్డితో ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌కు ప్రమాదవశత్తు విద్యుత్ తీగలు తగలడంతో గడ్డి దగ్ధమైంది. గ్రామస్తుల వివరాల మేరకు... దేవనకొండ మండలానికి చెందిన వ్యక్తి నాగలదిన్నె గ్రామంలో గడ్డిని తీసుకొని ప్రయాణిస్తుండగా విద్యుత్ తీగలు తగలి ట్రాక్టర్‌పై మంటలు చెలరేగాయి. గమనించిన గ్రామస్తులు డ్రైవర్‌కు తెలిపారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి గ్రామస్తుల సహాయంతో ట్రాక్టర్‌పై ఉన్న గడ్డిని ట్రాక్టర్ నుంచి తొలగించి, ప్రమాదం నుంచి బయటపడ్డారు. మంటలు అదుపు కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో రూ.15 వేల విలువ గల గడ్డి బూడిద పాలైంది.

ఆలూరులో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - ఆలూరు

మాట్లాడుతున్న బాధిత రైతులు

ఆలూరులోని చెరువు కట్ట ఆవరణలో ఉన్న కోట వీధికి చెందిన రైతు వీరేష్‌కు సంబంధించిన రూ.1.50 లక్ష విలువ గల గడ్డివామి దగ్ధమైంది. బాధిత రైతు వివరాల మేరకు... సోమవారం మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టారు. స్థానికులు, రైతులు ఆర్పేందుకు ప్రయత్నం చేసినా గడ్డివామి చుట్టూ మంటలు చెలరేగడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఎంతసేపటికీ అగ్నిమాపక వాహనం రాకపోవడంతో సర్పంచి అరుణదేవి తమ్ముడు బెంగళూరు కిషోర్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక కేంద్రానికి మళ్లీ సమాచారం ఇవ్వగా సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుంది. వాహనంలోని మోటార్ మరమ్మతుల కోసం ఇతర ప్రాంతానికి పంపామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని మండిపడ్డారు. అనంతరం ఆదోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలి బూడిదయింది. వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన తరుణంలో ఆలూరు అగ్నిమాపక కేంద్రంలో మోటార్ మరమ్మతులకు పంపామని చెప్పడం సిగ్గుచేటని రైతు వాపోయారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకొని అగ్నిప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని పశువులకు పశుగ్రాసం అందించాలని స్థానిక రైతులు, ప్రజలు కోరారు.

పోషణ్ పక్వాడపై తల్లులకు అవగాహన

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని 5వ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ్ పక్వాడపై తల్లులకు అవగాహన కల్పించారు. ఎమ్మిగనూరు ఐసిడిఎస్ సిడిపిఒ సఫరున్నీసా బేగం హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ... తల్లులు తీసుకోవాల్సిన ఆహారం, అంగన్వాడీలో ఇచ్చే పోషకాహారం గురించి తల్లులకు వివరించినట్లు తెలిపారు. సర్పంచి హైమావతి, సూపర్‌వైజర్లు జరీనా, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

NAME CHANGE

I, SHAIK IRFAN BASHA (Old Name) S/o.Nisar Ahmed shaikh, R/o.H.No:23/217/1, Karvanpet, Adoni, Kurnool dist, AP., I changed my name as Syed Irfan Basha S/o.Syed nisar Ahmed Henceforth I will be known as Syed Irfan Basha S/o.Syed Nisar Ahmed

IN THE COURT OF THE IIND ADDL. DISTRICT JUDGE KURNOOL AT ADONI
I.A.No.299/2024 IN O.S.No.22/2024

Between:
Sri Ajatha Shambulinga Shivacharyula Swamy, Peetadhipathi, Sri Gurupattada swamy Mutt, J.Hosalli village, Halaharvi mandal. ...Petitioner.
V/s
Halaharvi Dasaratha Ramireddy and two others ...Respondents.

TO:R-3:
Penkulinti Sanjappa S/o Netteppa, aged about 66 years, Cultivator, Resident of H.No.48, Infantry Road, Dadiyara Hostel, Bellary, Karnataka State-583103.

Whereas the above named the petitioner filed an application Under Order 39 Rule 1 & 2 and section 151CPC for grant of interim injunction restraining the Respondents from interfering with the peaceful possession and enjoyment of the petitioner. You are hereby directed to appear before this Honorable court on 24-04-2025 either in person or your Advocate and to file counter if any, falling which the matter will be decided in your absence and you will be set ex-parte.

Hearing Date: 24-04-2025.

SHRI. Y.R. MALLIKARJUNA,
SHIR.L.VEERABHADRA GOUD,
ADVOCATE FOR PETITIONER
ADONI-518301.

IN THE COURT OF THE IIND ADDL. DISTRICT JUDGE KURNOOL AT ADONI
O.S.No.22/2024

Between:
Sri Ajatha Shambulinga Shivacharyula Swamy, Peetadhipathi, Sri Gurupattada swamy Mutt, J.Hosalli village, Halaharvi mandal. ...Petitioner
V/s
Halaharvi Dasaratha Ramireddy and two others ...Respondents

TO:D-3:
Penkulinti Sanjappa S/o Netteppa, aged about 66 years, Cultivator, Resident of H.No.48, Infantry Road, Dadiyara Hostel, Bellary, Karnataka State-583103.

Whereas the above named the plaintiff filed a suit for permanent injunction from interfering with the peaceful possession and enjoyment of the plaintiff. You are hereby directed to appear before this Honorable court on 24-04-2025 either in person or your Advocate and to file written statement if any, falling which the matter will be decided in your absence and you will be set ex-parte.

Hearing Date:: 24/04/255

SHRI. Y.R. MALLIKARJUNA,
SHIR. L.VEERABHADRA GOUD ,
ADVOCATE FOR PETITIONER
ADONI-518301.